ఆ సలహా అవినాష్‌కి బాగా నచ్చింది. విన్నదే తడవుగా చిప్పలాంటి ముఖాన్ని అల్చిప్పలా విప్పార్చాడు.

రోజూ కన్నా ఆ రోజు సాయంత్రం కొంచెం ముందరగా నిద్రలేచి, తొందరగా బయల్దేరి కాఫీ రెస్టారెంట్‌కి చేరుకున్నాడు. అతను కూర్చున్నది ఏదో నెంబర్ టేబుల్ లోనైనా అతను ఎడతెరిపి లేకుండా చూస్తున్నది మాత్రం, ఆమె రోజూ కూర్చునే పధ్నాలుగో నెంబర్ టేబుల్‌నే.

ఇంతలో ఇంద్రధనుస్సు మధ్య మెరుపు తీగలా తన స్నేహితురాళ్ళతో నడిచి వచ్చి, పధ్నాలుగో నెంబర్ టేబుల్‌లో కూర్చుని చుట్టూ ఉన్న పరిసరాల్ని ఓసారి కలియజూస్తూ అప్రయత్నంగా అవినాష్ వంక ఓ రెండు సెకన్లు చూపు నిలిపి, తరువాత తన స్నేహితురాళ్లతో మాటల్లో మునిగిపోయింది షర్మిళ.

అవినాష్ మాత్రం ఆమె వంకే చూస్తూ తన మనసులో మాట చెప్పాలని ఒక్క ఉదుటున పైకి లేచాడు. అదే సమయంలో తన గుండెవేగం రెట్టింపైన విషయం కూడా అతను గ్రహించాడు. వేగంతో కూడిన నడకతో ఆమెకి దగ్గరగా వెళ్లి నేరుగా ఆమె కళ్లల్లోకి చూస్తూ, కాస్త బిడియంగా "హాయ్. నా పేరు అవినాష్. నేను మెడిసిన్ ఫైనలియర్ చదువుతున్నాను." చెప్పాడతను.

"యస్. చెప్పండి అవినాష్" అందామె అనునయంగా నవ్వుతూ.

ఆమె చిరుమందహాసం చూసిన అతను ఓ క్షణం పాటు కొయ్యబారినా, మరో అరక్షణంలోనే తేరుకుని "మిమ్మల్ని గత వారం రోజులుగా గమనిస్తున్నాను. మిమ్మల్ని చూసిన ప్రతీసారీ నా మనసు పిండేస్తున్న ఫీలింగ్. మీతో మాట్లాడాలని, మిమ్మల్నే చూడాలని, ఎందుకో తెలీదు. కానీ మీరు నాకు నచ్చారు. ఇదే ప్రేమైతే నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను" చెప్పాడు నిర్భయంగా.

అప్పటివరకూ షర్మిళ పెదవులపై ఉన్న నవ్వు మాయమైంది. ఆమె చుట్టూ ఉన్న స్నేహితురాళ్లు అవినాష్‌ని రెప్పార్పని చూపుతో, ఒకింత ఆశ్చర్యంతో చూస్తుండిపోయారు. వాళ్లలో ఒకామె చక్రాల్లాంటి తన కళ్లు షర్మిళ వైపు ఫోకస్ చేస్తూ "చూశావా ఇప్పటికయినా ఒప్పుకుంటావా" అందామె.

ఆ మాటలు అర్థంకాని అవినాష్, షర్మిళ వంక క్వశ్చన్‌మార్క్ ఎక్స్‌ప్రెషన్‌తో చూస్తుండిపోయాడు.

ఆ చూపులకి అర్థం గ్రహించిన షర్మిళ "సారీ మిస్టర్ అవినాష్. నాకు పెళ్లై అయిదేళ్లవుతోంది. ఇద్దరు పిల్లలు కూడా" అని ఆమె చెప్పగానే, గుండెని ఎవరో గట్టిగా పిడికిట బిగించినట్టయిందతనికి. అయినా నిబ్బరంగా ఆమె మాటలు వినసాగాడు.

"నా ఆఫీస్ అవర్స్ అయిపోయాక ఇలా నా ఫ్రెండ్స్‌తో కల్సి ఈ రెస్టారెంట్‌కి రావడం పరిపాటే. అయితే ఓ వారం క్రితం నా ఫ్రెండ్స్ నాకో 'కాంప్లిమెంట్' ఇచ్చారు. అదేంటంటే, నాకు పెళ్లై పిల్లలున్నా నాలో ఇంకా చరిష్మా తగ్గలేదట. అలాగే నేను చీరల్లో కాకుండా మోడర్న్ డ్రెస్సెస్‌లో బయటికి వస్తే ప్రిన్స్ లాంటి అబ్బాయి నాకు ఐ లవ్ యు చెప్పేస్తాడన్నారు. నేనా మాటలు ఒప్పుకోలేదు. వీళ్ల బలవంతంపై ఓ వారం నుండి ఇలా ఈ డ్రెస్సుల్లో ఆఫీస్‌కి రావడం జరుగుతూండడంతో మీరు నా ఫ్రెండ్స్ ఇచ్చిన కాంప్లిమెంట్‌ని ఇలా నిజం చేసేశారు. అందుకు మీకు థాంక్స్. కానీ నేను మిమ్మల్నేమైనా డిస్టర్బ్ చేసుంటే మాత్రం అయామ్ సారీ" అని పైకి లేచి, తనదైన సోయ



గపు నవ్వుని పెదాలపై చిందిస్తూ, రాజహంస నడకతో అక్కడి నుంచి వెళ్లిపోయింది షర్మిళ.

అవినాష్ మాత్రం చెమర్చిన కళ్లతో, షర్మిళ నడిచి వెళ్లిపోయిన వైపే దీర్ఘంగా చూస్తుండిపోయాడు.

**-గంగాధర్ వడ్లమన్నాటి**
(విశాఖపట్నం)

★ ★ ★

# మనవడి ఉత్తరం

"పోస్ట్"

పోస్ట్‌మేన్ కేక విని వైదేహమ్మగారు ఆశ్చర్యపోయారు. నెమ్మదిగా లేచి ఓపిక తెచ్చుకుని గేటు దగ్గరికెళ్ళి "బాబూ..ఉత్తరం నాకేనా సరిగా చూడు" అన్నారు.

"వైదేహిగారు అంటే మీరేనా?"

"ఆ.."

"అయితే ఇది మీదే.." అని పోస్ట్‌కార్డ్ చేతిలో పెట్టి రివ్వున సైకిల్ తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆవిడ మనసులో రకరకాల ఆలోచనలు. 'తనకి ఉత్తరం రావడ మేమిటి? అసలు తనకెవరు రాస్తారని? ఎప్పుడో ఆయన బ్రతికి ఉన్నప్పుడు నెలల తరబడి క్యాంపుల కెళ్ళినప్పుడు ఉత్తరాలు రాసేవారు. ఆయన కాలం చేశాక...ఉన్న ఒక్కగానొక్క కొడుకు ప్రయోజకుడై..మరో రాష్ట్రంలో ఉద్యోగం చేస్తూ..తనకి నచ్చిన అమ్మాయిని పెళ్ళి చేసుకుని...తనని దాదాపు మర్చిపోయాడనే చెప్పాలి. మరి తనకి ఉత్తరం రాసిందెవరు?' ఆవిడకి ఆసక్తితో కూడిన ఉద్వేగం కలిగింది. గబ గబ లోపలికి వెళ్ళి గూట్లో వున్న కళ్ళజోడు తీసుకుని..వెలుగులోకి వచ్చి కూర్చుని చదవడం మొదలెట్టారు. "పూజ్యురాలైన నానమ్మకి మీ మనవడు నిఖిల్ రాయునది-

నానమ్మా! నువ్వు ఎలా వున్నావు. నిన్ను చూసి చాలా కాలమయింది. నా చిన్నప్పుడు నువ్వు చాలాసార్లు మా ఇంటికి వచ్చేదానివట. ఇప్పుడు ఎందుకో మానేశావట. అమ్మ చెప్పింది. ఎందుకు? నన్ను చూడాలని అనిపించదా? మా ఫ్రెండ్స్ నాన్నమ్మలు వాళ్ళకి రకరకాల స్వీట్స్‌చేసి తినిపిస్తారట. కథలు కూడా చెబుతారట. మరి నువ్వెందుకూ దూరంగా వుంటావు. నన్ను చూడాలని అస్సలు అనిపించదా..నేనేమైనా తప్పుగా రాస్తే ఫర్‌గివ్‌మి. ఈమధ్య నాకు క్లాసులో లెటర్ రైటింగ్ నేర్పారు. ఎవరికైనా ఇష్టమైన వాళ్ళకి లెటర్ రాయమని మా టీచర్ చెప్పింది. అందుకే నేను నీకు రాశాను. నానమ్మా నన్ను చూడడానికి రావూ. ప్లీజ్.

మీ మనవడు నిఖిల్."

ఉత్తరం చదివిన వైదేహమ్మగారి కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. మనవడు నిఖిల్ ఆవిడ మనసంతా నిండిపోయాడు. ఉత్తరంలోని అక్షరాలు తడుముతూ మనవడినే తృప్తిగా తడుముతున్నట్టుగా ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతోందావిడ. ఎన్నిసార్లు వాడిని చూడాలని అక్కడికి వెళదామనుకున్నా...గతంలో ఆవిడ పట్ల వాళ్ళ ప్రవర్తన గడపదాటనివ్వడం లేదు. గుండె రాయి చేసుకుని మోడులా బ్రతుకుతోంది. ఇప్పుడు మనవడి ఉత్తరం రూపంలో కాసిన్ని నీటి చుక్కలు పడ్డాయి.

లేచివెళ్ళి కలం కాగితం తెచ్చుకుని కొడుక్కి ఉత్తరం రాయసాగింది.

"చిరంజీవి శరత్‌కి!

మీరు క్షేమమని తలుస్తాను. నా మనవడు నాకు ఉత్తరం రాశాడు. ఉత్తరంలో వాడు రాసిన ప్రతి ప్రశ్నకి సమాధానం మీదగ్గరే ఉంది. అందుకే ఆ ఉత్తరాన్ని నీకు పంపిస్తున్నాను. వాడి ప్రశ్నలకి నిజాయితీగా సమాధానాలు చెప్పగలిగితే నీలో ఇంకా మానవత్వం మిగిలున్నట్టు. అది మనందరినీ మళ్ళీ దగ్గర చేస్తుంది. ఒకవేళ ఉత్తరం రాసినందుకు వాడిని నువ్వు తిట్టి-కొడితే, రేపు మీ పిల్లవాడికి మీరూ దూరమవుతారు. నేను శాపనార్థాలు పెట్టట్లేదు. చరిత్ర పునరావృత మవుతుందన్నది వాస్తవమని చెబుతున్నాను. నువ్వు తల్లిని మర్చిపోయినా నా మనవడు నన్ను గుర్తుంచుకున్నందుకు నాకెంతో సంతోషంగా ఉంది. నీలో నేను కోరుకుంటున్న మార్పు వస్తుందని ఆశిస్తూ..

వైదేహి"

**-ప్రతాప వెంకట సుబ్బారాయుడు**
(సికిందరాబాద్)